

త్యాగానికి ప్రతీక బక్రీద్
అల్లా పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే పండుగ బక్రీద్. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం.. 8లో▸



నిర్మించారు.. వదిలేశారు
భైంసా పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులో 2019లో రూ.2.65కోట్లతో నిర్మించిన మినీస్టేడియం అలంకారప్రాయమైంది. ప్రారంభానికి ముందే శిథిలమవుతోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: నూతన కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిలాష అభినవ్ నిర్మల్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఆర్డీవో, వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు



రేవంత్‌రెడ్డితో బొజ్జు, కుటుంబ సభ్యులు

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తన జన్మదినం సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కుటుంబసభ్యులతో కలిశారు. తన సతీమణి ద్రుపద, పిల్లలు తనీశ్, నితీశ్‌తో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి ఒక లేఖలో బొజ్జుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సభ్యులు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పర్యటించారు. రైతుల విద్యుత్ సమస్యలు తెలుసుకుని ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించారు. సుధాకర్‌రెడ్డి, భూమారెడ్డి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన అధికారులు ఇంతవరకు స్తంభాలు, వైర్లు ఇవ్వలేదని రైతులు తెలిపారు. అదనంగా మూడు డీడీలు కట్టాలని ఏఈ ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని అధికారులకు తెలిపినట్లు సంఘ్ జాతీయ కార్యదర్శి కొండెల్ల సాయిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అంబీర్ ఆనందర్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ.. భారతీయ కిసాన్ సంఘ్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. రైతులు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న రాజేశ్

నిర్మల్‌చైన్‌గేట్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనిట్ ప్రధాన కార్యదర్శి కష్టం రాజేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా మంచిర్యాల సోమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, జాయింట్ సెక్రటరీలుగా కూన రమాదేవి, మహేందర్, ట్రెజరర్‌గా రమేశ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్‌రెడ్డి, రాధిక, రాజమౌళి, మారుతి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల: మండలంలోని కల్లూర్ సెక్షన్ కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న విద్యుత్ ప్రజావాణిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొత్త కలెక్టర్‌పై కోటి ఆశలు..!



నిర్మల్ కలెక్టరేట్

కలెక్టర్ అభిలాష అభినవ్

- అభిలాష అభినవ్‌కు సవాళ్ల స్వాగతం
- జిల్లాలో ఎక్కడి అభివృద్ధి అక్కడే..
- ముంచుకొస్తున్న 'ముంపు కష్టాలు'
- గాడితప్పిన ప్రభుత్వ యంత్రాంగం
- పరీక్షగా నిలవనున్న 'స్థానిక' సమరం
- చేసేనా.. రాజకీయ సమన్వయం..!

నిర్మల్: జిల్లా ఆరో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌పైనే నిర్మల్ ఆశలు పెట్టుకుంది. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ తీసుకున్న ఆమెకు జిల్లా సాదరంగానే కాదు.. సమస్యలతోనూ స్వాగతం పలుకుతోంది. దాదాపు పది నెలలుగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలోనే ఉండిపోవడంతో జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక చాలా శాఖలు గాడి తప్పాయి. కొన్ని కార్యాలయాల్లో అధికారులు ఇష్టారీతిన వచ్చిపోతున్నారు. ఇక డబ్బులు ఇస్తే గాని పనులు చేయని అధికారులు, ఉద్యోగులూ ఉన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భిన్న రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుంటూ.. ప్రభుత్వ పథకాలను అమలు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటితో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం అలాభిష అభినవ్‌కు పరీక్షగానే చెప్పవచ్చు.

నిలిచిన అభివృద్ధి పనులు

గతేడాది అక్టోబర్ 9న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు కోడ్ అమలులోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి తాజాగా ముగిసిన పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ వరకు ఎన్నికల కోడ్ ఉండటంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అంతకు ముందు కలెక్టర్ వరుణ్‌రెడ్డిని ఎన్నికల కమిషన్ బాధ్యతలు నుంచి తప్పించడంతో ఆయన చేపట్టిన పనులూ మధ్యలోనే ఆగిపోయాయి. ఆ తర్వాత కలెక్టర్‌గా వచ్చిన ఆశిష్ సంగ్వాన్ ఎన్నికల పనుల్లోనే బిజీ అయ్యారు. ఆయన కామారెడ్డికి బదిలీ అయ్యారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్ గతంలో నిలిచిన అభివృద్ధి పనులతో పాటు తాజాగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను జిల్లాలో ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది.

పొంచి ఉన్న ముంపు ముప్పు

కొత్త కలెక్టర్ రావడంతోనే చేపట్టాల్సిన తొలి పనిగా ముంపు ముప్పును చెప్పవచ్చు. మూడేళ్లుగా ప్రతీ వానాకాలంలో జిల్లా నీట మునుగుతోంది. వందల ఎకరాల్లో పంట నష్టంతో పాటు ఆస్తి నష్టం తప్పడం లేదు. సాక్షాత్తు జిల్లా కేంద్రమే జలసంద్రంగా మారుతోంది. రెండేళ్లుగా నిండా మునుగుతూ స్థానిక ప్రజలకు గుండె దడ పెట్టిస్తున్న కడెం ప్రాజెక్టును ప్రత్యేక శ్రద్ధతో పట్టించుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతాధికారులు, ఇంజినీర్లను ప్రాజెక్టు వద్దనే ఉంచి పనులు చేయిస్తోంది. వీటిని సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత జిల్లా పాలనాధికారిపైనే ఉంది. జిల్లాకేంద్రంతో పాటు భైంసా పట్టణంలో ఇష్టారీతిన వెంచర్లు చేయడం, కాలువలు, కందకాలు, చెరువులను పూడ్చేస్తూ.. ప్లాట్లుగా మార్చేయడంతో ముంపు ముప్పు ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది. వరుణ్‌రెడ్డి కలెక్టర్‌గా ఉన్న సమయంలో కొంతమేరకు కాలువలు, కందకాలు, చెరువుల్లోని ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచాయి. ఆశిష్ సంగ్వాన్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు చెరువులు, కందకాల ఆక్రమణలపై చర్యల కోసం ప్రత్యేకంగా లేక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో కమిటీ చర్యలు ఆగిపోయాయి. ప్రస్తుతం వానాకాలం నేపథ్యంలో కొత్త కలెక్టర్ ముందుగా ముంపు ముప్పును తప్పించే ముందస్తు చర్యలు మళ్లీ చేపట్టాల్సిన అవసరం ఉంది.

పరీక్షగా 'స్థానిక' సమరం

గతంలో మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పని చేసిన అభిలాష అభినవ్ తాజాగా స్థానిక సమరాన్ని ఎదుర్కోనున్నారు. త్వరలోనే వరుసగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ఉండనున్నాయి. జిల్లా పాలనాధికారిగా ఆమె తొలిసారి ఈ ఎన్నికలను ఎదుర్కోనున్నారు. గ్రామీణ స్థాయిలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాల్సిన బరువైన బాధ్యత నెరవేర్చాల్సి ఉంటుంది. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ బల్దియాల్లోనూ ఏడాదిలోపే ఎన్నికలు ఉండే అవకాశం ఉంది.

గాడి తప్పిన యంత్రాంగం

వరుసగా ప్రధాన ఎన్నికలు ఉండటంతో యంత్రాంగమంతా వాటిపైనే దృష్టి పెట్టింది. ఉన్నతాధికారులంతా ఎన్నికలకు సంబంధించిన పనుల్లోనే నిమగ్నమయ్యారు. దీంతో సాధారణ ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రజలకు అందించే సేవల్లోనూ ఆటంకాలు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కిందిస్థాయిలో చాలామంది ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లంచం ఇవ్వనిదే పనిచేయమన్న తరహాలో పలు శాఖలు ఉండటం ఇబ్బందికరంగా మారింది. గతంలో పనిచేసిన ఇద్దరు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో శాఖల వారీగా పర్యవేక్షణ, పరిశీలన చేపట్టకపోవడం కూడా వారికి అలుసుగా మారినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఉపాధ్యాయులు వివిధ శాఖల ఉద్యోగులకు అమలు చేసిన లైవ్ లొకేషన్ పైన నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ వ్యవస్థ కారణంగా ఒకప్పుడు రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరు వచ్చింది. కలెక్టర్ల పరిశీలన లేక చాలామంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు లైవ్ లొకేషన్‌ను పట్టించుకోవడం లేదు. తమకు నచ్చినట్లుగా.. నచ్చిన వేళల్లో విధులకు వెళ్లడం, రావడం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సాక్షాత్తు సమీకృత కలెక్టరేట్‌లోనే ఉన్న చాలా శాఖల్లో అధికారులు, సిబ్బంది సమయాన్ని పాటించని సందర్భాలు చాలాసార్లు బయటపడ్డాయి.

సమన్వయం చేస్తారా..!

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో రాజకీయ పరిస్థితులు ఉండటం గమనార్హం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. జిల్లాలోని నిర్మల్, ముథోల్ రెండు ప్రధాన నియోజకవర్గాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచారు. జిల్లా నుంచే అసెంబ్లీలో బీజేఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు. అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండు అధికార పార్టీలను సమన్వయం చేసుకుంటూ.. రెండు ప్రభుత్వాల నుంచి వచ్చే అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పాలనాధికారిదే. జిల్లాలోని రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కొత్త కలెక్టర్‌కు కత్తి మీద సాము లాంటిదనే వాదన వస్తోంది.

ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

- జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలకు భూమిపూజ చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.
- దిలావర్‌పూర్ మండలంలో చేపట్టిన ఇథనాల్ పరిశ్రమ వివాదం కొలిక్కి రాలేదు.
- సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో మాజీ మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి ఆగమేఘాల మీద భూమిపూజ చేసిన ఆయిల్ పామ్ పరిశ్రమ అడుగు కూడా ముందుకు పడలేదు.
- కాళేశ్వరం పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన 27వ ప్యాకేజీని ప్రారంభించినా.. ఇప్పటికీ నీటిని ఎత్తిపోయడం లేదు.
- ఇక 28వ ప్యాకేజీ పనులే పూర్తి కాలేదు.
- నిర్మల్‌లో పీజీ కాలేజీ పేరుకు మాత్రమే కొనసాగుతోంది. తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- ఒకప్పుడు జిల్లా వైద్యరంగం ఉత్తమ సేవలతో రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చుకుంది. పది నెలలుగా వైద్య వ్యవస్థపై సరైన పర్యవేక్షణ లేక మళ్లీ గాడి తప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లొల్లి రోజురోజుకు ముదురుతోంది. దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ కేటాయించకపోవడంతో చాలామంది కట్టిన ఇళ్లు ఆక్రమించుకుంటున్నారు.

బదిలీల్లో గందరగోళం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది నిర్మల్ రూరల్ మండలంలోని వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాల. ఇక్కడ యూ డైస్ ప్రకారం 109 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు, హిందీ, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. వేకెన్సీ లిస్టులో కూడా చూపించారు. తీరా వెబ్ ఆప్షన్‌లో తెలుగు, హిందీ పండిత్ పోస్టులు చూపించి, పీడీ పోస్టుకు ఈ పాఠశాల కనిపించకపోవడంతో వ్యాయామ ఉపాధ్యాయులు అవాక్కయ్యారు. డీఈవో కార్యాలయంలో సంప్రదిస్తే ఆ పోస్టు పైనుంచే బ్లాక్ అయిందని, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు ఇక అక్కడ ఉండదని బదులిచ్చారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. దీంతో ఆ పాఠశాల విద్యార్థులు వ్యాయామ విద్యకు ఇక దూరమైనట్లే. మొదట వేకెన్సీ లిస్టులో చూపించి ఆ తర్వాత బ్లాక్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

- వేకెన్సీ లిస్ట్‌లో చూపించి ఆపై బ్లాక్
- పైనుంచి చేశారంటున్న అధికారులు
- ఓటీపీ రాక ఉపాధ్యాయుల ఇక్కట్లు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం నెలకొంది. ఎస్జీటీ క్యాడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం అధికారులు శనివారం సాయంత్రం వెబ్ ఆప్షన్ ఓపెన్ చేశారు. ఒక్కరోజు ముందు వరకు వేకెన్సీ జాబితాలో పాఠశాల పేరుండి వెబ్ ఆప్షన్‌లో లేకపోయేసరికి ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. తెలుగు, హిందీ పండిత్, పీడీ పోస్టులకు ఇలా జరిగిందని వాపోయారు. మరోవైపు లాగిన్ కోసం ఓటీపీ రాకపోవడంతో ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చింది.

ముందు పోస్టు చూపి.. ఆపై బ్లాక్ లిస్ట్

ప్రమోషన్‌తో పాటు బదిలీల్లో తమకు దగ్గరగా ఉన్న పోస్టు తీసుకుందామని తలచిన ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. సీనియార్టీ లిస్టు, వేకెన్సీ లిస్టులో మొదట జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల పాఠశాలలను చూపిన విద్యాశాఖ అధికారులు ఆ తర్వాత వెబ్ ఆప్షన్‌లో వాటిని బ్లాక్ చేశారు. జిల్లా కేంద్రంలోని జుమ్మెరత్‌పేట్ పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇప్పటివరకు రెండు తెలుగు పండిత్ పోస్టులుండేవి. కానీ.. శనివారం వెబ్ ఆప్షన్‌లో ఒక పోస్టు మాత్రమే చూపించారు. దీంతో 500 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడు ఎలా సరిపోతారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఇదిగాం ఉన్నత పాఠశాలలో ఉన్న ఒక్క హిందీ పోస్టును తొలగించారు. అక్కడి విద్యార్థులకు హిందీ బోధించే ఉపాధ్యాయుడే కరువయ్యే పరిస్థితి నెలకొంది.



విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు (ఫైల్)

ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

జిల్లాలో ఉపాధ్యాయ ప్రమోషన్ల కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం ముగిసింది. శనివారం సాయంత్రం 6గంటల నుంచి ఆదివారం మధ్యాహ్నం 2గంటల వరకు సమయం ఇచ్చారు. సాయంత్రం ఓ గంట పాటు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. పండిత, పీఈటీ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టుల్లో ప్రమోషన్ల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం రాత్రి గాని సోమవారం గాని అలాట్‌మెంట్ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా, అర్హత లేని వారికి స్కూల్ అసిస్టెంట్ సీనియార్టీ లిస్టులో పేర్లు వచ్చాయని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ కోసం ఓ ఉపాధ్యాయురాలు తనకు అర్హతలు లేకున్నా గాని దరఖాస్తు చేసుకోగా లిస్టులో పేరు వచ్చిందని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆమెపై చర్యలకు పూనుకున్నారని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లలో అక్రమాలను వెలువరించాలని పలువురు కోరుతున్నారు.

మొత్తం ఖాళీలు చూపించాలి



ప్రమోషన్లు, బదిలీల్లో జిల్లాలోని మొత్తం ఖాళీలు చూపించాలి. అయితేనే ఉపాధ్యాయులందరికీ న్యాయం జరుగుతుంది. దూరం ఉన్న పాఠశాలలను ప్రస్తుతం భర్తీ చేసి, దగ్గరగా ఉన్నవి డీఎస్సీలో భర్తీ చేయడం సరికాదు. సీనియర్లకు తప్పకుండా న్యాయం చేయాలి. ఆఫ్‌లైన్ విధానం ద్వారా భర్తీ చేస్తే ఇంకా బాగుండేది.

– రాజేశ్‌నాయక్, ఎస్టీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రక్రియ పారదర్శకమే..



జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. ప్రమోషన్లలో కొన్ని పోస్టులను పైనుంచి బ్లాక్ చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా అలా చేయాల్సి వచ్చింది. ఆ పోస్టులు వచ్చే డీఎస్సీ ద్వారా భర్తీ చేసే అవకాశం ఉంది. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం



2007-2008 బ్యాచ్ విద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2003–04, 2007–08, 2009–10 ఎస్సెస్సీ బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా కుటుంబ సభ్యులతో హాజరై పాఠశాలలో సందడి చేశారు. ఆప్యాయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. మూడు బ్యాచ్‌లకు చెందిన పూర్వవిద్యార్థుల రాకతో పాఠశాలలో సందడి నెలకొంది.



2003-2004 బ్యాచ్ విద్యార్థులు



2009-2010 బ్యాచ్ విద్యార్థులు

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: బక్రీద్‌ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకీషర్మిల ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బందోబస్తు కోసం బయటి జిల్లాల నుంచి ఫోర్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలు సృష్టించినా, ప్రేరేపించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఆవుల అక్రమ రవాణా జరగకుండా చూశామని పేర్కొన్నారు. ఎవరైనా సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం చేసినా, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా అభ్యంతరకర పోస్టులు పెట్టినా.. ప్రతిస్పందించకుండా, సంయమనం పాటించాలని సూచించారు. ఆ పోస్టుల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పోస్టు చేసిన, ఫార్వర్డ్ చేసిన వారితో పాటు గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ధరణి'పై ఫోకస్

- దరఖాస్తులు త్వరగా పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 17వేల వరకు పెండింగ్

జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తుల సంఖ్య
ఆదిలాబాద్	1,730
ఆసిఫాబాద్	3,417
మంచిర్యాల	7,911
నిర్మల్	3,999

కైలాస్‌నగర్: ధరణి దరఖాస్తుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 14న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మాడ్యూల్స్ వారీగా క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు విచారణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సర్కారు తాజా ఆదేశాలతో ఇక తమ ఇబ్బందులు తొలుగుతాయని భావిస్తున్నారు. పలు మాడ్యూల్స్‌లో మార్పులను చేసిన ప్రభుత్వం తహసీల్దార్, ఆర్డీవో స్థాయిల్లోనూ పరిష్కరించే అవకాశం కల్పించింది. దీంతో పెండింగ్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం కలగనుందనే అభిప్రాయం బాధిత రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

నెరవేరని స్పెషల్ డ్రైవ్ లక్ష్యం

ధరణిలో అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి జూన్ 4లోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు మండలాల వారీగా వాటిని గుర్తించారు. వివరాలూ ప్రభుత్వానికి పంపించారు. అయితే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతంగా సాగకపోవడం, పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో అధికారులంతా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. దీంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు బ్రేక్ పడింది. కొన్ని దరఖాస్తులను పరిష్కరించినప్పటికీ పూర్తిస్థాయిలో జరగక స్పెషల్ డ్రైవ్ లక్ష్యం నెరవేరకుండాపోయింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రభుత్వం మరోసారి ధరణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించింది.

పెండింగ్‌లో 17వేల దరఖాస్తులు

భూ సమస్యలకు సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వివిధ మాడ్యూల్స్ కింద మొత్తం 17,057 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా భూ విస్తీర్ణం, సర్వే నంబర్లలో తప్పులు, పేరు మార్పిడి, పట్టాల్లో తప్పులు దొర్లడం, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్ వంటి అంశాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. వారసత్వం కింద పట్టా మార్పిడి వంటివి కూడా అత్యధికంగానే ఉన్నాయి. అలాగే నిషేధిత భూముల వ్యవహారాలకు సంబంధించిన దరఖాస్తులతో పాటు ఇతరత్రా సమస్యలతో కూడిన దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పు ప్రాంతంలోని మంచిర్యాల జిల్లాలో దరఖాస్తులు అత్యధికంగా పెండింగ్‌లో ఉండగా.. అత్యల్పంగా ఆదిలాబాద్‌లో ఉన్నాయి.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాడ్యూల్స్ వారీగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల వివరాలు

మాడ్యుల్స్	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
అప్లికేషన్ ఫర్ ఎన్ఆర్ఐపీపీబీ	00	00	02	03
కోర్టు కేసు ఇంటిమేషన్	49	53	437	63
కోర్టు కేసు పీపీబీ	43	57	46	49
డాటా కరెక్షన్	741	1481	3796	1704
జీపీఏ/ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	29	27	106	60
గ్రీవెన్సెస్ ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ	137	353	731	297
ఇష్యూ ఆఫ్ పీపీబీ/నాలా అవుట్‌సైడ్స్	01	09	388	00
ఖాతా మెర్జింగ్	03	06	10	16
ల్యాండ్ మ్యాటర్ గ్రీవెన్సెస్	216	723	735	451
నాలా విత్‌ఔట్ పీపీబీ	16	29	138	67
ఆర్గనైజేషన్ పీపీబీ	01	00	00	00
పెండింగ్ మ్యుటేషన్	93	150	402	397
సక్సేషన్	401	529	1118	892
అర్బన్ ల్యాండ్	00	00	02	00

క్లుప్తంగా

బోథ్ ఎమ్మెల్యేకు భారత క్రికెటర్ శుభాకాంక్షలు



సోషల్ మీడియా ద్వారా ఎమ్మెల్యే అనిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న క్రికెటర్ కుల్దీప్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆదివారం భారత క్రికెటర్ కుల్దీప్ యాదవ్ సోషల్ మీడియా ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయుఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా క్రికెటర్ శుభాకాంక్షలు తెలియజేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

ఒకరిపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జైజవానగర్ కాలనీకి చెందిన గంద్రత్ రాజుపై ఇద్దరు దాడికి పాల్పడ్డారని టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ కిషన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజు శనివారం మధ్యాహ్న సమయంలో తాంసి బస్టాండ్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో భోజనం చేస్తున్నాడు. అదే హోటల్‌లో శ్రీకాంత్, కార్తీక్ అనే ఇద్దరు భోజనం చేస్తూ అసభ్యపదజాలంతో దూషించారు. ఆ తర్వాత వారు అక్కడినుంచి వెళ్లిపోయారు. పరిచయం ఉన్నవారే కావడంతో తర్వాత ఫోన్ చేసి క్షమించమని చెప్పారు. మార్కెట్ యార్డుకు రావాలని చెప్పడంతో రాజు అక్కడికి చేరుకున్నాడు. తర్వాత వారి మధ్య మాటామాట పెరిగి వారిద్దరు రాజుపై దాడికి దిగారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇసుక లారీ పట్టివేత



పట్టుబడిన లారీ

బోథ్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని పొచ్చెర క్రాస్ వద్ద స్థానికులు ఆదివారం సాయంత్రం పట్టుకున్నారు. వెంట నే మైనింగ్ అధికారులతో పాటు స్థానిక పోలీ సులకు సమాచారం అందించారు. ఆదిలాబా ద్ నుంచి వచ్చిన మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ పవార్ రమేశ్ లారీని పరిశీలించారు. అప్పటి కే డ్రైవర్ పరారవగా.. సోమవారం పరిశీలిస్తామని చెప్పి ఆయన అక్కడి నుంచి వెనుదిరిగారు. అయితే మైనింగ్ అధికారి, పోలీసులు లారీని అక్కడే వదిలివెళ్లడం అనుమానాలకు తావిస్తోంది. కాగా, నిర్మల్ జిల్లా నుంచి నిత్యం లారీలలో ఓవర్‌లోడ్‌తో ఇసుక అక్రమంగా సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన రాజలింగు(35) మృతి చెందాడు. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై ఉడుంపూర్ నుంచి ఉట్నూర్‌కు వస్తున్న తరుణంలో దంతన్‌పల్లి వద్ద గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీ కొని కిందపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య గంగమణి, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లెక్క తేలుతోంది!



వన్యప్రాణుల మలాన్ని గుర్తిస్తున్న ఎన్జీవో సభ్యులు

- కొనసాగుతున్న వన్యప్రాణుల సర్వే
- మరో వారంలో పూర్తి

జన్నారం:కవ్వాల్ టైగర్‌జోన్‌లో నాలుగో విడత వన్యప్రాణుల గణన మొదలైంది. అడవిలో తిరిగే పులులు, చిరుత పులులతోపాటు మాంసహార, శాకాహార వన్యప్రాణులను లెక్కించేందుకు చేపట్టిన సర్వే చివరి దశకు చేరింది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ(ఎన్‌టీసీఏ) గైడ్‌లైన్స్ ప్రకారం పులులు, చిరుతలతోపాటుగా అడవిలో ఆవాసం ఏర్పాటు చేసుకున్న వివిధ వన్యప్రాణుల వివరాలు సేకరిస్తున్నారు. ఎఫ్‌డీపీటీ శాంతారాం, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు ఎస్‌టీసీహెచ్, ఎన్జీవో సభ్యుల ఆధ్వర్యంలో కవ్వాల్ టైగర్‌జోని అన్ని డివిజన్లలో వేర్వేరుగా గణన కొనసాగుతోంది. ఏప్రిల్ 22న ప్రారంభించిన గణన ప్రస్తుతం చివరి దశకు వచ్చింది.

రెండు రకాలుగా గణన..

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని కోర్, బఫర్ ప్రాంతాలలో మాంసాహార, శాకాహార జంతువుల ఉనికి, సంఖ్యతోపాటుగా వాటి కదలికలను తెలుసుకోవడానికి వన్యప్రాణుల సర్వే(అక్యుపెన్సీ సర్వే) చేపట్టారు. ఈ సర్వే ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో చేస్తున్నారు. కెమెరాలలో, ప్రత్యేక్షంగా చూసిన జంతువుల ఆధారంగా ప్రత్యక్ష పద్ధతిగా, మలం, వెంట్రుకలు, అడుగులు, గోర్లు, చెట్లను గీరిన విధానం ద్వారా పరోక్ష పద్ధతిన వన్యప్రాణులను లెక్కిస్తున్నారు. ఈ సర్వేలో హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులతోపాటుగా ఎన్జీవో సభ్యులు, రేంజ్ అధికారులు, డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొంటున్నారు. ఈ సర్వే ద్వారా కవ్వాల్ టైగర్‌జోన్ మాంసాహార జంతువులకు ఎంత వరకు అనువైన ప్రాంతం అనే అంశం కూడా తెలుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

95 శాతం పూర్తి..

ఇప్పటి వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, ఖానాపూర్, ఉట్నూర్ అటవీ డివిజన్ల పరిధిలోని కోర్, బఫర్ ఏరియాల్లో సర్వే పూర్తి చేశారు. జన్నారం అటవీ డివిజన్‌లోని తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి, బీర్సాయిపేట, ఉడుంపూర్, కడెం రేంజ్‌ల కోర్ ప్రాంతాలలో సర్వే కొనసాగుతోంది. తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్‌లలో ప్రస్తుతం ఎన్జీవో సభ్యులు పరోక్ష పద్ధతిలో వన్యప్రాణులను లెక్కిస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో పులి మినహా చిరుత పులి, అడవి కుక్క, ఎలుగుబంటి లాంటి మాంసాహార జంతువుల పాదముద్రలు, మల, మూత్రాల సంకేతాలను గుర్తించారు. చెన్నూరు, ఆదిలాబాద్ అటవీ డివిజన్లలో పులి అడుగులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

వారంలో పూర్తి వివరాలు



రెండు నెలలుగా వివిధ ప్రాంతాల్లో మాంసాహార జంతువులు, శాకాహార జంతువుల సర్వే జరుగుతోంది. ఎన్జీవో సభ్యులతోపాటుగా మా సిబ్బంది కూడా సర్వేలో పాల్గొంటున్నారు. మేముకూడా నేరుగా వన్యప్రాణులను గుర్తించాం. వారం రో జుల్లో సర్వే పూర్తిచేసి వివరాలు వెల్లడిస్తాం. నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

విరివిగా శాకాహార జంతువులు..

జన్నారం అటవీ డివిజన్‌లోని జన్నారం, తాళ్లపేట రేంజ్‌లో నిర్వహించిన సర్వేలో విరివిగా శాకాహార జంతువుల ఆనవాళ్లు గుర్తించామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. నేరుగా కొన్నిరకాల జంతువులు కనిపించగా, కొన్ని జంతువులను పాదముద్రలు, వెంట్రుకలు, మలం, చెట్లకు అంటిన శరీర ఆనవాళ్ల ఆధారంగా గుర్తించినట్లు వివరించారు. జన్నారం అటవీ డివిజన్‌లో అడవి దున్నలు, మనుబోతులు, దుప్పి, అడవి పంది, చుక్కల జింక, గడ్డి జింక, కొండ గొర్రెలు, సాంబార్లను గుర్తించినట్లు తెలిపారు. మనుబోతులు, అడవి పందులు అడవి మొత్తం ఉన్నాయని పేర్కొన్నారు. కొండప్రాంతాల్లో సాంబర్ల సంఖ్య, దట్టమైన అడవుల్లో అడవి దున్నల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. చుక్కల దుప్పులు మైదాన ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. గడ్డి జింక, కొండ గొర్రెల సంఖ్య తక్కువ సంఖ్యలో ఉన్నట్లు సర్వేలో తెలిసిందని చెప్పారు.

అడెల్లి ఆలయంలో భక్తుల సందడి



మొక్కులు చెల్లించుకుంటున్న హిజ్రాలు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన వరంగల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హిజ్రాలు వారి సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ అవుట్‌పోస్టు, ఆలయ పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

'అడెల్లి'లో పాయల్ శంకర్ పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న పాయల్ శంకర్

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని ఆదివారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దర్శించుకుని మొ క్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆ లయ సిబ్బంది శంకర్‌కు ఘనస్వాగతం పలికి ప్రత్యేక ప్రవేశం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయనను ఆలయ మండపంలో ఆలయ మర్యాదలతో సత్కరించారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది!

- హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు
- 27న జిల్లా స్థాయిలో ఎంపిక ప్రక్రియ

భైంసాటౌన్: చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు హకీంపేటలోని క్రీడా పాఠశాల ఆహ్వానం పలుకుతోంది. నాలుగో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ఏటా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తోంది. ఈ మేరకు నూతన విద్యాసంవత్సరానికిగాను ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల కాగా, మండల, జిల్లాస్థాయిలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అర్హత పరీక్షలు నిర్వహిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు నాలుగో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఆటల్లో శిక్షణతో పాటు పదో తరగతి వరకు ఉచిత విద్య, వసతి కల్పించనున్నారు.

అర్హులు ఎవరంటే..

నాలుగో తరగతి చదువుతున్న 8–9 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులు. ఆగస్టు 31, 2016లోపు జన్మించిన వారై ఉండాలి. మండలస్థాయిలో ఎంఈవో ద్వారా లేదా నేరుగా జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. జిల్లాస్థాయిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేస్తారు. ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎంపిక ఉంటుంది. జిల్లాస్థాయిలో ఎంపికైనవారికి జూలై 7, 8 తేదీల్లో రాష్ట్రస్థాయిలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఎంపిక పరీక్షలు ఇవే..

ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లేయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, షటిల్ రన్, మెడిసినల్ బాల్ పుట్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వయసు ధ్రువీకరణ పరీక్షలు నిర్వహిస్తారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు వయస్సు, విద్యార్హతల పత్రాలు (ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి), బర్త్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, మూడో తరగతి వరకు ప్రోగ్రెస్ రిపోర్టులు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి.

సద్వినియోగం చేసుకోవాలి

హకీంపేటలోని క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 27న జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలి. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయిలో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

– నసీఖాన్, జిల్లా యువజన క్రీడల అధికారి, నిర్మల్

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడే ఈద్-ఉల్-అజ్‌హా
- ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు, ఈద్గాలు ముస్తాబు

ఉట్నూర్‌రూరల్/నెన్నెల: మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు అల్లా పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్. దీనినే ఈద్- ఉల్- అజ్‌హా అని కూడా అంటారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున ఈ పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇస్లాం మానవాళికి నిర్దేశించిన విధివిధానాల్లో ఐదో విధి అయిన మక్కా యాత్ర చేయడం, జంతువులను బలిచ్చి మాంసాన్ని పేదలకు పంపిణీ చేయడం, రెండు రకాత్‌లుగా నమాజ్ చేయడం ఈ పండుగ ప్రత్యేకత. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం.

సమాజంలోని రుగ్మతల నుంచి జనవాళిని జాగృత పరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లా భూమండలానికి 80వేల మంది ప్రవక్తలను పంపినట్లు ఖురాన్ చెబుతోంది. వారిలో ప్రవక్త హజరత్ ఇబ్రహీం అల్లాపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం గడపాలని మానవాళికి బోధిస్తున్న ప్రవక్తల్లోని విశ్వాసాన్ని కూడా గ్రహించేందుకు అల్లా అనేక విధాలుగా పరీక్షించేవారు. ప్రవక్త ఇబ్రహీం అనేక పరీక్షల్లో తన విశ్వాసాన్ని నిరూపించినట్లు పవిత్ర ఖురాన్ చెబుతుంది. ఈ క్రమంలోనే హజరత్ ఇబ్రహీం, ఆయన సతీమణి హాజీరాలకు వారి వృద్ధాప్యంలో అల్లా వారికి సంతాన ప్రాప్తి కలిగించారు. లేకలేక జన్మించిన తన కుమారుడు ఇస్మాయిల్‌ను వృద్ధ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో ఒకరోజు రాత్రి ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లా పేర బలిదానం చేస్తున్నట్లు కలగంటారు. దీంతో అల్లా తన కుమారుడిని బలిదానం కోరుకుంటున్నారని గ్రహించిన ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిదానం (ఖుర్బానీ) ఇచ్చేందుకు సిద్ధపడతాడు. తండ్రి అంతరంగాన్ని గమనించిన కుమారుడు ఇస్మాయిల్ కూడా అల్లా మార్గంలో బలి అయ్యేందుకు సిద్ధపడుతాడు. బలి ఇచ్చే సమయంలో పుత్రవాత్సల్యం అడ్డువస్తే తనను బలి ఇవ్వకుండా తన తండ్రి వెనుకడుగు వేస్తే అల్లా దృష్టిలో విశ్వాస ఘాతకుడిగా మిగలకుండా కళ్లకు గంతలతో తనను బలి ఇవ్వమంటూ తండ్రికి సూచిస్తాడు. ఆ మేరకు అల్లా నామస్మరణతో తన కుమారుడిని బలి ఇచ్చేందుకు గొంతుపై కత్తి పెట్టిన క్షణంలో త్యాగనిరతికి మెచ్చిన అల్లా ఆఖరు క్షణంలో ఇస్మాయిల్‌ను తప్పించి అదే స్థానంలో ఒక దుంబా(పొట్టేలు)ను ప్రత్యక్ష పరుస్తారు. దీంతో పొట్టేలు గొంతు తెగి అల్లా మార్గంలో అది ఖుర్బాన్ అవుతుంది.

మాంసం పంపిణీ..

ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చిన అల్లా ఆ రోజు నుంచి ఏటా బక్రీద్ పండుగ జరుపుకుంటూ జంతుబలి ఇవ్వాలని ఈ విధానాన్ని ప్రళయం వరకు కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది. ఈ మేరకు ముస్లింలు బక్రీద్ రోజున పెద్ద ఎత్తున జంతువులను బలిచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు.

మక్కా యాత్ర..

ఇస్లాం విధి విధానాల్లో ఐదో విధానమైన హజ్(మక్కాయాత్ర) ఇదే రోజున మక్కాలో జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ముస్లింలు మక్కా మసీదులోని కాబా దర్శనం చేసుకుంటారు. 40 రోజుల హజ్ యాత్రలో భాగంగా మక్కా మదీనాల్లో నమాజ్ ఆచరిస్తూ సైతాన్‌కు రాళ్లు వేసే ప్రక్రియలో పాల్గొంటూ దైవారాధనలో గడుపుతారు.



నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

ప్రధాన లక్ష్యం..

దాన ధర్మాలకు, పేదలను ఆదుకునేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇస్లాం బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇచ్చే జంతువుల మాంసంలో మూడో భాగాన్ని పేదలకు పంపిణీ చేయాలని నిర్దేశించింది. ధనికులతోపాటు పేదలకు కూడా పండుగపూట మాంసాహారం భుజించాలని ఇస్లాం నిర్దేశించిన మేరకు ఖుర్బానీ ఇచ్చే ప్రతీ ముస్లిం ఒకవంతు మాంసాన్ని పేదలకు పంపిణీ చేస్తారు. జంతు మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధువులకు పంపిణీ చేస్తారు. మరో భాగాన్ని కుటుంబ సభ్యులు భుజిస్తారు.

ఈదుల్ జుహ నమాజ్..

పండుగ రోజుల్లో రెండు రకాత్‌లుగా నమాజ్ ఆచరిస్తారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఉదయాన్నే ఈద్-ఉల్- జుహ నమాజ్‌ను ఈద్గాలు, మసీదుల్లో ఆచరిస్తారు. నమాజ్ ఆచరణకు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో మసీదుల నిర్వహకులు తగు ఏర్పాట్లు చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి



బక్రీద్‌ను త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలంతా అల్లా ఆదేశాలు పాటిస్తూ పండుగలో భాగస్వాములవుతారు. ప్రత్యేక ప్రార్థనల కోసం ఈద్గాలు, మసీదుల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈద్ నమాజ్ ఉదయం 7గంటలకు నమాజ్ ఉంటుంది.

– ఖలీం, మౌలానా జామా మసీద్, ఉట్నూర్

పోడు భూములకు పట్టాలివ్వాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్

ఎదులాపురం: రాష్ట్రవ్యాప్తంగా సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు అందించాలని, అలా గే పోడు సాగు చేస్తున్న వారిపై అటవీ అధికారులు దాడులు ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. పోడు భూముల్లో కందకాలు తవ్వడం ఆపాలన్నారు. అలాగే పోడు సాగుదారులపై అటవీ అధికారుల దాడుల విషయంలో జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క కలుగజేసుకోవాలని కోరారు.

భగవంత్‌రావు స్ఫూర్తితో ఉద్యమించాలి..

సంఘం రాష్ట్ర నాయకుడు ఆత్రం భగవంత్‌రావు స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని సచిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన భగవంత్‌రావు నాలుగో వర్ధంతి సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భగవంత్‌రావు అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, రాష్ట్ర నాయకులు భీంరావు, జిల్లా నాయకులు మెస్రం మహేశ్, సునీల్, ఈశ్వర్, కిష్టన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, కార్యదర్శి కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాఘువులు తదితరులు పాల్గొన్నారు.



భగవంత్‌రావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సుధీర్‌కుమార్, అర్ఫాత్‌ఖాన్‌కు తెలంగాణ స్ఫూర్తి పురస్కారం



అవార్డు అందుకుంటున్న న్యాయవాది సుధీర్ కుమార్



అవార్డు అందుకుంటున్న అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరికి తెలంగాణ స్ఫూర్తి పురస్కారం దక్కింది. న్యాయవాది సంగెం సుధీర్ కుమార్, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్‌లు శనివారం రాత్రి హైదరాబాద్‌లో ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, న్యాయవాదులు, ఉద్యమకారులను హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తెలుగు భాష సాంస్కృతిక శాఖ, సత్యసంగీత ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందజేశారు. ఎమ్మెల్సీ ముఖేష్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. వీరు అవార్డులు అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పాస్టర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెంబి: అనారోగ్యం, ఆర్థిక సమస్యల్లో ఉన్నవారు తమ మతంలోకి వస్తే పరిష్కారం లభిస్తుందని మా యమాటలతో మతమార్పిడికి పాల్పడుతున్న పాస్టర్‌పై ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండలంలోని నాగాపూర్ గ్రామంలో అనారోగ్యంతో ఆర్థికంగా వె నుకబడిన వారిని గుర్తించి తమ మతంలోకి రావా లని పాస్టర్ పలువురిని కోరారు. తమ మతంలోకి వస్తే ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉంటారని నమ్మబలికి మత మార్పిడికి పాల్పడుతుండగా పా స్టర్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. పెంబి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అమాయకులకు మాయమాటలు చెప్పి మతమార్పిడి చేస్తున్న పా స్టర్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. నాగాపూర్, మందపల్లి గ్రామాల యువకులున్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాల మృత్యువాత

సోన్: మండలంలోని న్యూబొప్పారం గ్రా మంలో ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో వెల్మల గ్రామానికి చెందిన కేశెట్టి పోశె ట్టి గేదె మృతి చెందింది. దీని విలువ రూ.50 వేల వరకు ఉంటుందని రైతు తెలిపాడు.

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఎస్‌డీ ఖమర్‌కు చెందిన గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పశువైద్యాధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఘటనా స్థలాన్ని లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, లైన్‌మన్ కృపాలన్ పరిశీలించారు.

అర్లి(కే)లో మేక..

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే) గ్రామానికి చెందిన జెడ్ల సాయినాథ్ మేక ప్ర మాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో మృతి చెందింది. మేక విలువ రూ.15వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

క్లుప్తంగా

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాలలో ప్రసిద్ధి గాంచిన శ్రీ గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్, బోకర్, ఇస్లాపూర్, హిమాయత్ నగర్, శివుని ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, హారతి, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల తలనీలాలు, తులాభారం వేయించి, బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా భీమన్న పండుగ



గోదావరి జలాలు తెస్తున్న ముదిరాజ్‌లు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఆదివారం భీమన్న పండుగను ఘనంగా జరుపుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ గోదావరి జలాలను తీసుకువచ్చి భీమన్న దేవునికి అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పిల్లా పాపలను సల్లగా చూడాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు దేవేందర్, ఉమామహేశ్వర్, పిట్ల సాయన్న, మహేందర్, రాజు, శశి, రాజన్న, కాశీ, తదితరులు పాల్గొన్నారు.

భీమన్న ఆలయంలో పూజలు



నైవేద్యం సమర్పిస్తున్న నాయక్ పోడ్ సంఘు సభ్యులు


కుంటాల: కుంటాల పొలిమేరలోని శ్రీ భీమన్న దేవాలయంలో ఆదివారం నాయక్ పోడ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయసంతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు డప్పు, వాయిద్యాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి గజాల వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చ గంగారాం, కళ్యాణ్ గజేందర్, గంగారాం మచ్చ గణేష్, మారుతి, చందు, సుభాకర్, నగేష్, గజ్జారాం, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల పూజలు

వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ ముదిరాజ్ సంఘ సభ్యులు భీమన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో భీమన్న పండుగ ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా వర్షాకాలం ప్రారంభానికి ముందు భీమన్న పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో మెండె నర్సయ్య, గంగాధర్, ఎర్రన్న, అశోక్, లక్ష్మణ్, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

మహాగాంలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో ఆదివారం ఆరుష్ చిన్న పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నరేశ్ చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 30 మంది చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాకేశ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ముధోల్: బిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విత్తనాలు, ఎరువులు ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. బాసర, ముధోల్, బిద్రెల్లి గోదాంలలో డీఏపీ రూ.1,350, ముధోల్ బోరెగావ్ బాసర, కారేగావ్, అష్ట చింతకుంట గోదాంలలో గ్రోమోర్ 20:20:0:13 రూ.1,100, సోయాబీన్ విత్తనాలు రూ.2,100, అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆధార్‌కార్డుతో సంప్రదించాలన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

- భైంసాలో రూ.కోట్లు వెచ్చించి మినీస్టేడియం నిర్మాణం
- ఆరేళ్లుగా నిరుపయోగంగానే..
- ప్రారంభానికి ముందే శిథిలదశకు..



ముఖద్వారం వద్ద విరిగిపోయిన గేటు



భైంసాలోని మినీస్టేడియం

భైంసాటౌన్: క్రీడాకారులు, విద్యార్థులతో పాటు యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జిల్లాలో నిర్మించిన మినీ స్టేడియాలు నిరుపయోగంగా మారాయి. డివిజన్ కేంద్రమైన భైంసాతో పాటు ఖానాపూర్‌లో మినీ స్టేడియాలు మంజూరు కాగా నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నాయి. అయినా ఇప్పటికీ వినియోగంలోకి రాకపోగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన స్టేడియం భవనాలు ప్రారంభానికి ముందే శిథిలదశకు చేరుకుంటున్నాయి. భైంసా పట్టణంలో పార్డి(బి) బైపాస్‌రోడ్‌లో 2019లో మినీస్టేడియం నిర్మించారు. రూ.2.65 కోట్లతో ఇండోర్, అవుట్‌డోర్ ఆటలు ఆడేలా భవన నిర్మాణాలు చేశారు. ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. ఇదివరకు టీఎస్‌ఎస్పీ రెండో బెటాలియన్ పోలీసులు తాత్కాలిక ఆశ్రయం పొందగా ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఇండోర్ భవనం పైకప్పు రేకులు ఎగిరిపోగా తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. గోడలకు పగుళ్లు తేలాయి. పట్టణానికి దూరంగా ఉండడంతో పాఠశాల, కళాశాల స్థాయిలో జరిగే క్రీడాపోటీలు నిర్వహించడం లేదు. యువత, క్రీడాకారులు సైతం మినీ స్టేడియంలో ఆటలు ఆడేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మినీ స్టేడియం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఖానాపూర్‌లోనూ పట్టణానికి దూరంగా మినీ స్టేడియం ఉండడంతో క్రీడాకారులు స్టేడియాన్ని వినియోగించుకోవడం లేదు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు సైతం మినీ స్టేడియాలను వినియోగించుకోవడం లేదు. ఫలితంగా క్రీడాకారుల కోసం నిర్మించిన మినీ స్టేడియాలు జిల్లాలో అలంకారప్రాయంగా మారాయి.

స్టేడియాలు సరే.. కోచ్‌లు ఏరి..?

జిల్లాలోని భైంసా, ఖానాపూర్‌లో మినీ స్టేడియాలు నిర్మించారు. అయితే క్రీడాకారులు, యువత, విద్యార్థులకు ఆయా ఆటల్లో శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు అవసరం. అలాగే వాచ్‌మన్ వంటి ఇతర సిబ్బంది కూడా అవసరం. కానీ కేవలం స్టేడియాలు నిర్మించి కోచ్‌లను నియమించకపోవడంతో క్రీడలపై అవగాహన లేక ఆసక్తి ఉన్నా రాణించలేకపోతున్నారు. భైంసా, ఖానాపూర్ పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారు. అయితే వారిలో ప్రతిభ గుర్తించి మెరుగైన శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశముంది. ఇప్పటికైనా మినీ స్టేడియాలను వినియోగంలోకి తేవడంతో పాటు కోచ్‌లను నియమించి క్రీడాకారులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కోచ్‌ల నియామకం కోసం ప్రతిపాదించాం

భైంసా, ఖానాపూర్‌లో మినీ స్టేడియాలు నిర్మించారు. భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే కోచ్‌లు లేకపోవడంతో అందుబాటులోకి రాలేదు. వీటితో పాటు నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో కోచ్‌ల నియామకం కోసం స్పోర్ట్స్ అథారిటీకి లేఖ రాశాం.

– నఫేఖాన్, జిల్లా యువజన క్రీడల అధికారి, నిర్మల్

గంగనీళ్లతో గ్రామ దేవతలకు అభిషేకం



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు



ఖానాపూర్: మస్కాపూర్‌లో పూజలు చేస్తున్న గ్రామస్తులు

సోన్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆదివారం మండల కేంద్రంతో పాటు, న్యూవెల్మల్ గ్రామంలో గ్రామ దేవతలకు గంగనీళ్లతో అభిషేకం చేశారు. గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో, మంగళహారతులతో జాలరీల వలలతో, పోతురాజుల విన్యాసాలతో గోదావరినదికి వెళ్లి గంగాజలాన్ని తీసుకవచ్చి ఊరిలోని గ్రామ దేవతలను అభిషేకించారు. పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ రోడ్డ రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంతో పాటు మండలంలోని బాబాపూర్, న్యూ కంజర్, తదితర గ్రామాల్లో గ్రామ దేవతల పండుగ నిర్వహించారు. వీడీసీ సభ్యులు గోదావరి జలాలు తీసుకువచ్చి గ్రామ దేవతలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, గోసంపల్లె, దిలావార్‌పూర్, తదితర గ్రామాల్లో ఆదివారం ఆయా గ్రామాల ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా వానాకాలానికి ముందు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండడంతో పాటు పిల్ల, పాపలతో ప్రజలు, గోడ్డు, గోదలు ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేశారు.

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందలో ఊరడి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ, మహాలక్ష్మీ మందిరం వద్దకు గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

లోకేశ్వరం: మండలంలోని హద్‌గాం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన చంద్రశేఖర్‌ను ఆదివారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సురేష్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజారాం, నాయకులు రమణారావు, దేవేందర్, నవీన్, వెంకటరమణ, లింగన్న, సుదర్శన్, రాజేందర్, శ్రీనివాస్, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఎమ్మెల్యే బొజ్జు జన్మదిన వేడుకలు

ఖానాపూర్: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కార్యకర్తలు రక్తదానం చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, వెంకాగౌడ్, కావలి సంతోశ్, అంకం రాజేందర్, అమానుల్లాఖాన్, సలీం ఖాన్, షౌకత్‌పాషా, పరిమి సురేశ్, జన్నారపు శంకర్, మీర్జాబేగ్, అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, నాయకులు రమేశ్, కోల శ్రీనివాస్, ఇందూర్‌నేత, వెంకటేశ్, రహీం, లక్ష్మణ్, భూషణ్, పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న చైర్మన్ చిన్నం సత్యం

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో వాసవీక్లబ్ ముందంజ

ఖానాపూర్: సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీక్లబ్ ముందంజలో ఉందని క్లబ్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి బాల సంతోశ్ అన్నారు. పట్టణంలోని వాసవిమాత ఆలయంలో వాసవిక్లబ్‌తో పాటు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్ టూ డస్క్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదుగురు వీధి వ్యాపారులకు గొడుగులు, ఐదుగురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు మాస్కులు, టవల్స్ అందజేశారు. 38 పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, కంపాక్స్ బాక్సులు, వాసవి మాత ఆలయానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. నూతనంగా పదిమంది సభ్యులను క్లబ్‌లో చేర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జితేందర్, కిషన్, చంద్రశేఖర్, రవీందర్, సంతోశ్, మానస, ప్రవంతి, వరలక్ష్మి, సుధాకర్, రాజు, లక్ష్మీనారాయణ, భూమన్న, గీత, వాసవి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌తో క్లబ్ సభ్యులు

భారీగా వెలుస్తున్న ఇసుక డంపులు

- టిప్పర్ల ద్వారా మహారాష్ట్రకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఉపశనాల శివారులో ఇసుక డంప్‌లు

బేల: మండలంలోని కొబ్బాయి, శంకర్‌గూడ, ఉపశనాల శివారుల్లో గత వారం రోజులుగా భారీగా ఇసుక డంపులు వెలిశాయి. వర్షకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుడిహత్నూర్, ఆదిలాబాద్, నార్నూర్, గాదిగూడ మండలానికి చెందిన పలువురు అక్రమార్కులు మండలంలోని కాంగార్‌పూర్ శివారులోని పెన్‌గంగ నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా లారీల ద్వారా ఇసుకను తరలించి, మహారాష్ట్ర వైపు ఉన్న సరిహద్దు రెవెన్యూ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తున్నారు. కొన్నిసార్లు టిప్పర్‌లను నేరుగా మహారాష్ట్రలోని గ్రామాలకు తరలించి, ఒక్కొక్కటి రూ.40 నుంచి 60వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ ఇసుక దందా అధికారులకు తెలిసినప్పటికీ కనీసం చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రయాణికుల పాట్లు ...



తానూరు: మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని బెల్‌తరోడాలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో చెట్లకింద, హోటళ్లలో కూర్చుని బస్సులకోసం వేచిచూడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి : అమృత, ఆర్టీసీ డిపో మేనేజర్, ఫోన్ : 99592 26005

హరిత లక్ష్యం 2.10 లక్షలు

- నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు
- వర్షాలు కురిస్తే నాటేందుకు సిద్ధం



వాలేగాం నర్సరీలో పెంచుతున్న మొక్కలు

భైంసారూరల్: వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమవుతోంది. భైంసా మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో 2.90 లక్షల మొక్కలు పెంచుతున్నారు. ఈ ఏడాది హరితహారం కార్యక్రమంలో భాగంగా 2.10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ప్రత్యేక అధికారులు ఈ నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్నారు. వర్షాలు కురిస్తే మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ నర్సరీలు, అటవీశాఖ నర్సరీల్లో పెంచిన మొక్కలను సిద్ధంగా ఉంచారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికే మొక్కలను తరలిస్తున్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

30 గ్రామ పంచాయతీల్లో...

హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది భైంసా మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా మొక్కలు పెంచుతున్నారు. పెంచిన మొక్కలను వేరుచేసి నాటేందుకు స్థలాలు ఎంపిక చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో మొక్కలు నాటేందుకు సర్పంచులు, కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సమావేశం నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అన్ని శాఖల అధికారులతో కలిసి మొక్కలునాటి పెంచేందుకు కృషి చేస్తున్నారు.

పల్లె ప్రకృతివనాల్లో...

పల్లె ప్రకృతి వనాల్లో భారీగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం అటవీశాఖతో పాటు ప్రత్యేక నర్సరీల్లో పెంచిన మొక్కలు నాటుతున్నారు. చిట్టడవిని తలపించేలా మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారులు సమావేశాలు నిర్వహించి వర్షాలు జోరందుకోగానే మొక్కలునాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఉపాధిహామీ కూలీలతో నాటిన మొక్కలకు రక్షణ కల్పించేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.



మొక్కలు పరిశీలిస్తున్న డీపీవో (ఫైల్)

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ముదిరాజ్‌ల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం, దేవాలయ నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. ముదిరాజులు వృత్తిపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ముదిరాజుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటును అందిస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనం, దేవాలయ నిర్మాణాలకు ప్రభుత్వపరంగా నిధులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి దారవేణి రాము, ప్రధాన కార్యదర్శి దార్లరవి, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, బొజ్జ నారాయణ, బొమ్మెన లస్మన్న, దొంతుల ప్రవీణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

గోవధను అరికట్టాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

తలమడుగు: బక్రీద్ పండుగకు గోవధను అరికట్టాలని తలమడుగు పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకుల ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బీజేవైఎం మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. వన్య ప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇటీవలే ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన పిటిషన్ పరిశీలించి గోవధ, గోవుల అక్రమ రవాణా జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. అదేవిధంగా పశువులను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాతజీ కిరణ్, పొట్టిపెల్లి శ్రీనివాస్, గోడం భుజంగ్ రావు, గిరిజన మోర్చా కోరండ్ల పురుషోత్తం, చెలక గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



మసీద్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై హన్మాండ్లు

నర్సాపూర్(జి): బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఆది వారం నర్సాపూర్ (జి), చాక్ పల్లి గ్రామాల మసీద్ కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు సికిందర్, గౌస్, షబ్బీర్, అల్వాలుద్దీన్, అజ్జు, జీషాన్, హనీఫ్, వసీం, మౌలానా, తదితరులు పాల్గొన్నారు.